మెలకువలు పాటిస్తే మంచిది

- కంకులు పసుపు రంగులో ఉన్నప్పుడే కోయాలి
- తేమ 14 శాతానికి మించితే బూజుపట్టే అవకాశం
- నూర్పిడి, ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి


ధాన్యాన్ని ఆరబెట్టి భద్రపర్చుతున్న రైతులు

రాజాం:

జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నూర్పులు చేపడుతున్నారు. ధాన్యాన్ని ఇంటికి తరలించి భద్రపరుచుకునే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ పరిస్థితుల్లో విధిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని రాజాం వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. వరి సాగుతో పాటు పంటకోత, నూర్పిడి, ఒబ్బిడిలోనూ మెలకువలు పాటించినప్పుడే దిగుబడులు పెరుగుతాయని పేర్కొంటున్నారు.

కోత నుంచే జాగ్రత్తలు తప్పనిసరి

వరి కంకుల్లో 80–90 శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడే పంటను కోయాలి. ఈ దశలో ధాన్యం గింజల్లో 18–24 వరకు తేమ శాతం ఉంటుంది. పూర్తిగా ఎండిపోయే వరకు పంట కోయకుండా వదిలేస్తే రెక్క రాల్చడం వల్ల గింజలు రాలిపోయి దిగుబడి తగ్గుతుంది. ధాన్యం గింజలపై పగుళ్లు వస్తాయి. పగిలిన ధాన్యాన్ని మిల్లులో ఆడించేటప్పుడు బియ్యం శాతం తగ్గి నూకలు శాతం ఎక్కువగా ఉంటుంది. పంటను కోసిన తరవాత తేమ శాతాన్ని తగ్గించడానికి వరి పనలను 4–5 రోజులు పొలంలోనే ఆరనివ్వాలి. కోసిన వరి పనలను కిందికి, మీదకు తిరగబెడితే సమానంగా ఎండుతాయి. వరి పనలు కోసిన తరవాత వర్షం కురిస్తే ఐదు శాతం ఉప్పుద్రావణాన్ని పనలపై జల్లితే ధాన్యం మొలకెత్తకుండా ఉండటంతో పాటు రంగు మారవు. వరి పంట పూతకొచ్చిన తరవాత 30 రోజుల్లో కోత దశకు చేరుకుంటుంది. పంట పూర్తిగా పండకుండా కోత కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉంటాయి. వరి కంకిలోని చివర గింజలు పూర్తిగా తోడుకోకుండా ధాన్యం సన్నగా ఉండి పొట్ట తెలుపు రంగులో ఉంటాయి. దీనివల్ల ధాన్యం దిగుబడి తగ్గి నూక, తవుడు శాతం ఎక్కువగా ఉంటుంది. పండిన పంటను యంత్రం ద్వారా నూర్చడం వల్ల మట్టి బెడ్డలు, చెత్త, దుమ్ము ధాన్యంలో ఉండవు. నూర్చిన ధాన్యాన్ని ఎక్కువగా ఎండ ఉన్నపుడు ఆరబెట్టకూడదు. ఒకేసారి తేమ తగ్గిపోయి మిల్లు ఆడించేటపుడు నూకలు ఎక్కువగా వస్తాయి.

ధాన్యం నిల్వ ఇలా..

- నూర్చిన ధాన్యాన్ని 14 శాతం కన్నా తక్కువగా తేమ ఉండేలా చూసుకోవాలి. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే ధాన్యం బూజు పట్టడం, రంగు మారడంతో పాటు కీటకాలు ఆశిస్తాయి. ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచాల్సివస్తే కీటకాలు ఆశించకుండా పొగపెట్టాలి.
- ధాన్యాన్ని పొడి సంచుల్లో వేయడంతో పాటు గోడలకు, నేలపై తేమ పీల్చకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలి.
- ధాన్యం బస్తాలను 1–2 అడుగుల ఎత్తులో బెంచీలు, అరుగుల మీద వేసినట్టుయితే భూమిపై ఉన్న తేమ లాక్కోదు. ఎలుకలు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వచేస్తే రంగు మారుతుంది. రైతులు సకాలంలో అమ్మడం లేదా మరపట్టించడం చేయాలి.

ఈ మెలకువలు తప్పనిసరి



ఆరుగాలం కష్టపడి వరిని పండించే రైతులు పంటకోత, కుప్పలు పెట్టడం, నూర్పిడిలో మెలకువలు పాటించినట్లయితే మంచి దిగుబడులు పొందవచ్చు. పండిన వరి పంటను సకాలంలో కోత కోయాలి. నూర్చిన ధాన్యంలో 14శాతం కన్న తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచకూడదు. సకాలంలో అమ్మడం లేదా మరపట్టించడం చేయాలి. ఎలుకల సమస్య లేకుండా చూసుకుంటే నష్టాలు రాకుండా జాగ్రత్తలు పడొచ్చు.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

క్లుప్తంగా

పేదలకు నిత్యావసరాల పంపిణీ


పేదలకు సరుకులు అందిస్తున్న వెంకటరమణ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో శ్రీసత్యసాయి సేవా కమిటీ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతీ నెల పంపిణీలో భాగంగా శనివారం పేదలకు తొమ్మిది రకాల సరుకులను సేవాదళ్ సభ్యులు సాదెం వెంకటరమణ అందజేశారు. కార్యక్రమంలో చొంగ రాంబాబు, సొంగ అప్పలనరసమ్మ, చీమల జగదీశ్వరి పాల్గొన్నారు.

వితరణ

బాడంగి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాల పూర్వ విద్యార్థి అంబటి గణపతి స్కూల్ బ్యాగులు వితరణ చేశారు. పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆయన మొత్తం 15 మంది విద్యార్థులకు రూ.5 వేల విలువైన బ్యాగులను ఉచితంగా అందజేశారు. పిల్లల విద్యాభివృద్ధికి సహకరించిన సదరు దాతను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో రూ.6 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ దిరిశాల ధర్మరాజును శనివారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం ముద్దాడ రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పనులు పరిశీలిస్తున్న అధికారులు

వంగర: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ లోపింటి త్రినాథ్ అన్నారు. మండలంలోని మగ్గూరులో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం పరిశీలించారు. మెటీరియల్ వినియోగం, నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రభాకరరావు ఉన్నారు.

మద్యంసీసాల స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న పోలీసులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేట సెంటర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం సీసాలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, మల్లంపేటకు చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు

తెర్లాం: రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన తెర్లాం హైస్కూల్ క్రీడాకారులను తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైద్యుడు కె.రామకృష్ణ అభినందించారు. నవంబరు నెలలో గుంటూరు, కాకినాడలలో జరిగిన ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్–17 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలురు, బాలికల జట్లలో విద్యార్థులు పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచి, జట్లు విన్నర్, రన్నరప్‌గా నిలవడంలో ప్రధాన పాత్ర వహించారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధిపనులు పరిశీలిస్తున్న పీడీ కళ్యాణచక్రవర్తి

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను డ్వామా ఇన్‌చార్జ్ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి శనివారం పరిశీలించారు. వేతనదారుల హాజరుపై ఆరాతీశారు. మస్తర్లను తనిఖీ చేశారు. పనులు సక్రమంగా నిర్వహించాలని వేతనదారులకు సూచించారు. రెండుపూటలా పని చేస్తే కనీస వేతనం లభిస్తుందన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేతనదారులు కోరిన చోట పనులు కల్పిస్తున్నామన్నారు. రేగిడి మండలంలో 24 పంచాయతీలో ఉపాధి పనులు జరుగుతున్నాయని, మొత్తం 1517 మంది వేతనదారులు ప్రతీరోజు పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ ఎస్.హరనాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి


రాజాం: పొగిరి జెడ్పీ హెచ్ఎస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. మండలంలో పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని సూచించారు. పెనుబాక యూపీ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం ఉన్నత పాఠశాలలో జరిగన మీటింగ్‌లో పట్టణ సీఐ అశోక్‌కుమార్, ఎంఈఓలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు పాల్గొన్నారు.

సంతకవిటి: విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఏపీ ఉమెన్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కావలి గ్రీష్మ అన్నారు. మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

రాజాం సిటీ: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్–టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు గంజాయి, మద్యం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

దళారులను ప్రోత్సహించొద్దు


ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

సంతకవిటి: ధాన్యం కొనుగోలులో దళారులను ప్రోత్సహించొద్దని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయాధికారి పైల నవీన్, కస్టోడియన్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమయ్యారు. పంచాయతీల వారీగా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ట్రక్ షీట్లను వెంట వెంటనే జనరేట్ చేయాలని, రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేట్లు చూడాలన్నారు. రైతులు కోరిన మిల్లుకు ధాన్యం చేరేలా సహకరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందితే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎఫ్‌పీఓ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి

- భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో పూజలు


రేగిడి: ఆమదాలవలసలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మండలంలోని ఆమదాలవలస, గోపెంపేట, రేగిడి, వన్నలి, అంబకండి తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కంచరాంలో అన్నసమారాధన

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలోని పూర్ణపుష్కలాంబ సమేత హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త టంకాల పాపినాయుడు ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన చేపట్టారు. సుబ్రహ్మణ్యస్వామి షష్టిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 10వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


రాజాం సిటీ: కంచరాంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు


బొబ్బిలి రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

బాడంగి: సుబ్రహ్మణ్య షష్టి పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని పాల్తేరు గ్రామంలో పార్వతీమల్లిఖార్జునస్వామి ఆలయంలో శ్రీవల్లిదేవసేన, సుబ్రహ్మణ్యస్వామిల వివాహం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాలకావిడి మహోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి కల్యాణం చూసేందుకు పాల్తేరు గ్రామస్తులు సహా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చాలామంది భక్తులు హాజరయ్యారు.

బొబ్బిలి: పట్టణంలోని దాడితల్లి కోవెలలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు రుద్రాక్షలు అందజేశారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీకనకదుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహ తిరువీధి చేపట్టారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి మనోహర్

రామభద్రపురం: మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన జొన్నాడ పురుషోత్తమరావు, గెద్ద రామ్‌ప్రసాద్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్.. పురుషోత్తమరావు కుటుంబానికి రూ.5 లక్షలు, రామ్‌ప్రసాద్ కుటుంబానికి రూ.49,977లు చొప్పున ఆర్థికసాయం విజయనగరంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గిరడ అప్పలస్వామి, మహంతి ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత


గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న డాక్టర్ అసిరినాయుడు

రేగిడి: వైద్య సేవల కోసం వివిధ గ్రామాల నుంచి శనివారం స్థానిక పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు పౌష్టికాహారం సమకూర్చారు. రేగిడి మండల కన్వీనర్ లావేటి విష్ణు, సత్యసాయి ఆధ్యాత్మిక వక్తి మామిడి శివప్రసాద్ పౌష్టికాహారాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు చేతులమీదుగా గర్భిణులకు అందించారు. ప్రతీ నెల వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీను సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రైస్‌మిల్లర్లు, వ్యవసాయ సిబ్బంది, పీఏసీఎస్ అధికారులు, సీఎస్‌డీటీలతో శనివారం సమావేశమైన ఆయన.. ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఇప్పటివరకు ఏ మేరకు ధాన్యం కొనుగోలు చేశారు.. ఇంకా మేర ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్న విషయాలపై ఆరాతీశారు. సకాలంలో మిల్లులకు ధాన్యం తరలించేలా చూడాలని, ధాన్య విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏవో శ్యామసుందర్, సీఎస్‌డీటీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై దశల వారీ పోరాటం


సమావేశం అనంతరం సంఘీభావం ప్రకటిస్తున్న ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ విద్యుత్‌మీటర్ల ఏర్పాటు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ దశల వారీగా పోరాటం చేసేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజల కోసం చేసే ఈ పోరాటానికి అందరూ సహకరించాలని, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు కోరారు. సమావేశంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మణ్‌నాయుడు, ఇఫ్టూ నాయకులు మెరిగాని గోపాలం, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముువ్వల శ్రీనివాసరావు, సీపీఎం మండల కన్వీనర్ సింగిరెడ్డి గోపాలం, ఏఐటీయూసీ నాయకుడు మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ


రాష్ట్ర క్రీడాకారులతో డాక్టర్ రవిప్రసాద్

రేగిడి: మండలంలోని ఏపీపురంలో వాలీబాల్ శిక్షణ పొందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ జట్టు క్రీడాకారులకు శనివారం యూనిఫాం దుస్తులు అందజేశారు. రాజాంకు చెందిన వైద్యుడు డాక్టర్ గార రవిప్రసాద్ క్రీడాకారులకు దుస్తులను వితరణగా అందజేశారు. 68వ అండర్–14 జాతీయ వాలీబాల్ పోటీలకు ఏపీ నుంచి 20 మంది ఎంపికయ్యారు. వారంతా గత పదిరోజులుగా ఉనుకూరులో వాలీబాల్ శిక్షణ పొందుతున్నారు. వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయాలను డాక్టర్ రవిప్రసాద్ ఏర్పాటు చేశారు. ఈనెల 10న వారణాసిలో జరిగే జాతీయ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున వీరంతా పాల్గొంటారని కోచ్ కె.రామచంద్రుడు తెలిపారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జైభీమ్

వంగర: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అన్నారు. మండలంలోని నీలయ్యవలస గ్రామంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సారా, మత్తుపాదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు.
సారా తయారీ, రవాణా, విక్రయాలపై పోలీసులతో కలిసి నిఘా పెట్టినట్లు చెప్పారు. సారా విక్రయాలపై ప్రజలకు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రమాదం.. ఈ ప్రయాణం!


రామభద్రపురం జాతీయ రహదారిపై ఆటో వెనక కిక్కిరిసి ఇలా..


కొండకెంగువ రూట్‌లో ఆటో వెనక్కి నిలబడి వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు


ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ఇలా..

రోడ్డు ప్రమాదాల బారినపడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నా.. మరెంతో మంది క్షతగాత్రులవుతున్నా.. ఇంకెంతో మంది శాశ్వత వికలాంగులవుతున్నా.. మేం.. మారమంటూ వ్యవహరిస్తున్నారు కొందరు. ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ కనిపిస్తున్నారు. ఆటోలు, టాటాఏస్ వ్యాన్‌లు, బైక్‌లు ఇలా అన్ని రకాల వాహనాలపై నిబంధనలు అతిక్రమిస్తూ, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్నారు. ఇలాంటి దృశ్యాలు శనివారం రామభద్రపురంలో సాక్షి కెమెరాకు చిక్కాయి. వాటిని చూసిన వారంతా ఈ ప్రయాణం.. ప్రమాదకరమని అంటున్నారు. ఇలాంటి ప్రయాణాలు చేయకూడదని సూచిస్తున్నారు.

– రామభద్రపురం